# కేసీఆర్ పథకాలు బంద్!

## ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ తూట్లు • రాష్ట్ర ప్రగతికి బాటలువేసిన స్కీమ్‌లకూ సున్నం

- జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు పొందిన పథకాలకూ మంగళం
- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, సీఎం బ్రేక్‌ఫాస్ట్ అన్నీ బంద్
- దళితబంధు, బీసీలకు లక్ష, విదేశీ విద్యానిధి మాయం
- పల్లెప్రగతి, పట్టణప్రగతి, సాగునీటి ప్రాజెక్టులకూ అదే గతి



హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): 'సామాజిక మార్పు' అనే ఉదాత్త ఆశయం కేవలం నినాదాలకే పరిమితం కావొద్దనే సంకల్పంతో గతంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. బిడ్డ గర్భంలో ఉన్నప్పటి నుంచి చివరి అంకం వరకు ఏయే దశల్లో, ఏయే అవసరాలు ఉంటాయో గుర్తించి అమలు చేసిన ఘనత, సమాజంలోని అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేసీఆర్ సర్కార్‌దే. అయితే, రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులో కొన్ని పథకాలను నిర్దాక్షిణ్యంగా అటకెక్కించగా, మరికొన్నింటిని నిధులు విడుదల చేయకుండా పక్కనపెట్టింది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఆయా పథకాలకు బ్రేకులు వేసింది. ఫలితంగా లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### బీసీలకు లక్ష

బీసీల్లోని కుల వృత్తులవారు కాలానికి తగ్గట్టుగా నైపుణ్య శిక్షణ పెంచుకొని, అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేసుకొని ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం బీసీబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. నాయీ బ్రాహ్మణులు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణులు.. ఇలా కులవృత్తులపై ఆధారపడి జీవించేవారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల దరఖాస్తులొచ్చాయి. అధికారులు వీటిని పరిశీలించి 4.16 లక్షల మంది అర్హులని తేల్చారు. ఇందులో సుమారు 40 వేల మందికి చెక్కులు అందజేశారు. మిగతా 3.76 లక్షల మందికి దశలవారీగా ఇవ్వాల్సి ఉన్నది. అయితే, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కనపెట్టింది. బీసీబంధు కింద చెక్కులు తీసుకున్నవారు ఆ డబ్బుతో ఏం చేశారో లెక్క చెప్పాలంటూ విజిలెన్స్ విచారణ మొదలు పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

### దళితబంధు




తరతరాలుగా అణచివేతకు గురవుతున్న దళితుల జీవితాలను బాగు చేయాలన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలుచేసింది. ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున సాయం అందించి, వారు తమకు నచ్చిన, నైపుణ్యం ఉన్న రంగంలో వ్యాపారులుగా ఎదిగేందుకు చేయూత అందించింది. ఈ క్రమంలో 40 వేల కుటుంబాలకు దళితబంధును మంజూరు చేసింది. మరో 1.30 లక్షల మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల హామీల్లో భాగంగా దళితబంధును రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటివరకు కనీసం కార్యాచరణ ప్రకటించలేదు. పైగా గతంలో ప్రొసీడింగ్స్ ఇచ్చిన యూనిట్లకు నిధులను కేటాయించడం లేదు.

### విదేశీ విద్యాసాయానికి అడ్డంకులు

పేద వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే కలలను సాకారం చేసుకొనేందుకు కేసీఆర్ ప్రభుత్వం విదేశీ విద్యానిధి పథకాలను అమలు చేసింది. బీసీల కోసం పూలే పేరుతో, ఎస్సీ, ఎస్టీల కోసం అంబేద్కర్ పేరుతో ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందించింది. పేద బ్రాహ్మణులకు కూడా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ద్వారా ఈ పథకాన్ని అమలుచేసింది. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి, వారి భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని, తద్వారా వారి కుటుంబాలు బాగుపడాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేసింది. ఇప్పటివరకు దాదాపు మూడు వేల మందికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందించింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి నిధులు ఇవ్వకుండా ఆపేసిందని ఆరోపణలొస్తున్నాయి. కొత్త స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోగా, పాత వాటికి నిధుల కేటాయింపు నిలిచిపోయినట్టు చెప్తున్నారు. దీంతో చదువు మధ్య లో ఆపేసే పరిస్థితి తలెత్తుతున్నది.

### నీటిపారుదల శాఖ

కనీవినీ ఎరుగని భారీ ప్రాజెక్టులతో రాష్ట్ర నీటిపారుదల రంగ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. కాంగ్రెస్ పార్టీ సాగునీటి రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌పై చేస్తున్న రాజకీయం, తద్వారా అన్నదాతలు ఎదుర్కొంటున్న కష్టాలు అందరికీ తెలిసిందే. మరోవైపు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల టెండర్లను రద్దు చేసింది. సంగమేశ్వర-బసవేశ్వర ప్రాజెక్టు నిర్మాణ పనులు ఆపేసింది. సమీక్షల పేరుతో ఇతర ప్రాజెక్టుల పనులు సైతం పురోగతి లేకుండా నిలిచిపోయాయి.

### పల్లెప్రగతి.. పట్టణప్రగతి

గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. బడ్జెట్ కేటాయింపులు చేసి, సమగ్ర కార్యాచరణతో పనులు చేపట్టింది. ఫలితంగా పల్లెల్లో, పట్టణాల్లో మౌలిక వసతులు సమకూరాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గాయి. ప్రజల ఆరోగ్యం మెరుగుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్నీ పక్కనపెట్టింది.

### టీఎస్ ఐపాస్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలకు అనుమతులను సులభతరం చేస్తూ గత ప్రభుత్వం టీఎస్ ఐపాస్‌ను ప్రవేశపెట్టింది. ఈ సింగిల్ విండో అనుమతుల విధానం దేశ పారిశ్రామిక రంగంలోనే వినూత్న ప్రయత్నంగా ప్రశంసలు అందుకున్నది. సులభంగా అనుమతులు వస్తుండటంతో వేలాది కంపెనీలు తెలంగాణ బాట పట్టాయి. అనేక రాష్ట్రాలు టీఎస్ఐపాస్‌ను అధ్యయనం చేసి అమలు చేశాయి. అయితే గత నాలుగు నెలలుగా టీఎస్ఐపాస్ నుంచి అనుమతులు ఆపేసినట్టు పారిశ్రామికవర్గాలు చెప్తున్నాయి.

### గొర్రెల పంపిణీ



యాదవ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతోపాటు మాంసం ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో యూనిట్‌కు 21 గొర్రెలు చొప్పున అందజేసింది. అసెంబ్లీ ఎన్నికల నాటికి.. మొదటి, రెండు విడతల్లో కలిపి 4.2 లక్షల యూనిట్లు పంపిణీ చేసింది. ఈ పథకం కింద ప్రభుత్వం రూ.5 వేల కోట్ల వరకు ఖర్చు చేసింది. వీటి ద్వారా రాష్ట్రంలో సుమారు కోటిన్నర గొర్రెపిల్లల ఉత్పత్తి జరిగిందని అంచనా. రెండో విడత కింద ఇంకా గొర్రెల పంపిణీ జరగాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని కొనసాగించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నది. డబ్బులు కట్టిన యాదవ కుటుంబాలు గొర్రెల కోసం ఎదురు చూస్తున్నాయి.



### సీఎం బ్రేక్‌ఫాస్ట్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం పూట ఆకలి తీర్చేందుకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకానికి కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 27,147 పాఠశాలల్లో, దాదాపు 23 లక్షల విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా ఈ పథకానికి కేసీఆర్ సర్కారు రూపకల్పన చేసింది. ఇందుకోసం రూ.672 కోట్లు కేటాయించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది.

### న్యూట్రిషన్ కిట్



గర్భిణుల్లో పోషకాహార లోపం ఉండొద్దనే ఆలోచనతో 2022 డిసెంబర్‌లో కేసీఆర్ ప్రభుత్వం 'కేసీఆర్ న్యూట్రిషన్ కిట్' పథకాన్ని ప్రారంభించింది. మొదట తొమ్మిది జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. పోషకాహార లోపం తగ్గడం, శిశు మరణాలు తగ్గడం వంటి మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. నిరుడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మిగతా 24 జిల్లాలకు విస్తరించింది. సుమారు 6.84 లక్షల మంది గర్భిణులకు కిట్లు అందించాలని సంకల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పక్కనపెట్టేసింది. కిట్ల కొనుగోలును ఆపేసింది. కనీసం తమకు పెండింగ్ బిల్లులు కూడా ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.



# ఇకపై కిట్‌లు కేంద్రం సాయంతోనే

## 'కేసీఆర్ కిట్'ను ఇన్నాళ్లు సొంతంగా నిర్వహించిన రాష్ట్రప్రభుత్వం

## పీఎంఎంవీవైతో కలిపి అమలు చేసే యోచనలో కాంగ్రెస్ సర్కార్

### పథకం పేరు మార్పు, కిట్, నగదు సాయంపై చర్చలు

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): మాతాశిశు సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న 'కేసీఆర్ కిట్' పథకం రూపురేఖలు మార్చాలని తెలంగాణ వైద్యారోగ్య శాఖ భావిస్తున్నది. ఇప్పటికే 'కేసీఆర్ కిట్' అనే పేరును తొలగించి తాత్కాలికంగా 'మదర్ అండ్ చైల్డ్ హెల్త్' (ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తున్నది. భవిష్యత్తులో ఈ పథకాన్ని ఎలా కొనసాగించాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిర్వహించిన సమీక్షల్లోనూ ఈ అంశంపై ప్రస్తావన వచ్చినట్టు సమాచారం. ఈ పథకం సొంతంగా నిర్వహించాలా? లేక కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా? అనే అంశంపై చర్చించినట్టు తెలిసింది. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు సమాచారం.

### సొంతంగా 1,300 కోట్లు

మాతాశిశు మరణాలను తగ్గించే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం 2017లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద గర్భిణులకు రూ.15 వేల వరకు ఆర్థిక సాయం అందించింది. ఇందులో ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగ పిల్లాడు పుడితే రూ.12 వేల నగదు అందించింది. దీంతోపాటు తల్లీబిడ్డకు అవసరమయ్యే వస్తువులతో కూడిన రూ.2 వేల విలువైన కిట్‌ను కూడా అందజేసింది. గత సంవత్సరం చివరినాటికి దాదాపు 14 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారని, దీనికోసం సుమారు 1,300 కోట్లు ఖర్చు చేసిందని వైద్యశాఖ వర్గాలు చెప్తున్నాయి. ఈ పథకంతో ప్రతి గర్భిణి వివరాలు నమోదవడంతో వంద శాతం దవాఖాన ప్రసవాలు సాధ్యమయ్యాయి. ఫలితంగా మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గాయి. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు రికార్డు స్థాయిలో పెరిగాయి.

### కేంద్ర పథకంతో కలుపుదామా?

కేంద్ర ప్రభుత్వం పీఎంఎంవీవై పథకం కింద గర్భిణులకు మూడు విడతల్లో రూ.6 వేల ఆర్థిక సాయం అందిస్తున్నది. ఈ నేపథ్యంలో కేసీఆర్ కిట్ పథకాన్ని పీఎంఎంవీవైతో కలిపి అమలుచేయాలని ఆరోగ్యశాఖ భావిస్తున్నది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గుతుందని లెక్కలేస్తున్నారు. అయితే, కేంద్రం నుంచి నిధులు తీసుకుంటే కచ్చితంగా వారి నియమ నిబంధనలకు అనుగుణంగా పత్రాల్లో, ప్రచారంలో కేంద్రం పేరును, లోగోను వాడాల్సి ఉంటుందని, సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖ సహకారంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పాల్సి వస్తుందని అధికారులు స్పష్టంచేస్తున్నారు. కిట్ పేరును సొంతంగా పెట్టుకోవడంపై కూడా కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉన్నదని అంటున్నారు. ఇంత చేసినా కేంద్రం ఎప్పటికప్పుడు వెంటనే నిధులు విడుదల చేయదని, మూడు నెలలకు ఒకసారి కేటాయింపులు ఉంటాయని చెప్తున్నారు. తల్లీ బిడ్డకు అవసరమయ్యే వస్తువులతో అందించే రూ.2 వేల విలువైన కిట్‌ను కొనసాగించే అంశంపై కూడా చర్చలు జరుగుతున్నాయి. దీంతో కేంద్రంతో కలిసి వెళ్తే కలిగే లాభనష్టాలపై నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తున్నది.

# రాజధానిపై 'ఉమ్మడి' వాదన

మొదటిపేజీ తరువాయి...

ఆగ్రహం వ్యక్తంచేశారు. మొత్తానికి హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. అయినా ఏపీ నేతల కుట్రలు ఆగలేదు. ఏ విధంగానైనా హైదరాబాద్‌ను తెలంగాణకు దక్కకుండా చేయాలనే కుట్రలతో ఉమ్మడి రాజధాని అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి రాజధాని ఏర్పాటుకు సమయం పడుతుంది కాబట్టి పదేండ్ల పాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలని పట్టుబట్టారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇందుకు అంగీకరించింది. ఇప్పుడు ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తుండడంతో మళ్లీ కుట్రలకు తెరలేపారు.

### సుబ్బారెడ్డితో మొదలు

హైదరాబాద్‌పై విషం కక్కడం వైసీపీ కీలక నేత వైవీ సుబ్బారెడ్డితో మొదలైంది. ఈ ఏడాది మొదట్లో ఉమ్మడి రాజధానిపై ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏపీ మూడు రాజధానుల అంశం న్యాయపరమైన వివాదాలతో కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని, ఏపీకి రాజధాని తేలేవరకు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సుబ్బారెడ్డి డిమాండ్‌కు వైసీపీ మరో కీలక నేత పెద్దారెడ్డి వంత పాడారు. సుబ్బారెడ్డి డిమాండ్‌లో ఏ మాత్రం తప్పులేదని, మరికొంత కాలం హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని పేర్కొన్నారు. వీరి వ్యాఖ్యలపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఏపీ వైసీపీ నేతల వ్యాఖ్యలపై అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించడంతో పాటు ఎదురుదాడికి దిగింది. హైదరాబాద్ తెలంగాణ సొంతమని, దీని జోలికొస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించడంతో ఏపీ నేతలు ఉమ్మడి రాజధానిపై వ్యాఖ్యలు చేయడం ఆపేశారు. ఇప్పుడు తాజాగా జై భారత్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మరోసారి ఈ తేనెతుట్టెను కదిపారు. ఈనెల 25న ఈ అంశంపై 'ఎక్స్'లో పోస్ట్ చేస్తూ ఏపీకి రాజధాని తేలేవరకు హైదరాబాద్‌ను మరో పదేండ్లపాటు ఉమ్మ డి రాజధానిగా కొనసాగించాలని, ఇందుకోసం రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణవాదుల ఆగ్రహం

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలంటూ ఏపీ నేతలు వరుసగా డిమాండ్ చేస్తుండడంపై తెలంగాణవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడువు ముగిసింది కాబట్టి పొడిగించే ప్రసక్తే లేదని, అలా చేస్తే మరో ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేనిపక్షంలో హైదరాబాద్‌ను తెలంగాణకు దక్కకుండా చేస్తారని హెచ్చరిస్తున్నారు.

> ఏపీ మూడు రాజధానుల అంశం న్యాయపరమైన వివాదాలతో కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. ఏపీ రాజధాని తేలేవరకు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి.
> **- వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి (ఫిబ్రవరి 13, 2024)**

> హైదరాబాద్‌ను మరికొంత కాలం ఉమ్మడి రాజధానిగా కొనసాగించడం మంచిదే. వైవీ డిమాండ్‌లో తప్పులేదు.
> **- వైసీపీ నేత పెద్దారెడ్డి**

> ఏపీకి రాజధాని ఏదో ఇంకా తేలలేదు. జూన్ 2తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తున్నది. మరో పదేండ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి. ఈ అంశాన్ని రాష్ట్రపతి పరిగణనలోకి తీసుకొని ఆర్డినెన్స్ జారీ చేయాలి.
> **సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ (మే 25, 2024)**

> ఏపీకి రాజధాని తేలేవరకు అవసరమైతే 30 ఏండ్లు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలి.
> **- నాగార్జున యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ ధర్నా (జూన్ 29, 2022)**

### కిక్కురుమనని కాంగ్రెస్ నేతలు

గతంలో వైసీపీ నేతలు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తే వెంటనే స్పందించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారికి కౌంటర్ ఇచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై సర్వత్రా ఆశ్చర్యం వ్యక్తమవుతున్నది. ఉమ్మడి రాజధాని అంశంపై లక్ష్మీనారాయణ తన అభిప్రాయం వ్యక్తంచేసి మూడు రోజులు గడుస్తున్నా ఒక్కరంటే ఒక్క కాంగ్రెస్ మంత్రి, నేత కూడా ఖండించకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

### పదేండ్లు పూర్తయినా లేని రాజధాని

ఆంధ్రప్రదేశ్ పరిస్థితి విచిత్రంగా తయారైంది. రాష్ట్ర విభజన జరిగి పదేండ్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ రాజధాని లేని రాష్ట్రంగానే మిగిలిపోయింది. విభజిత ఏపీ తొలి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మూడు రాజధానుల ఏర్పాటును ఎజెండాగా పెట్టుకున్నది. ఇది కోర్టుకు చేరడంతో ఇప్పటివరకు ఏపీకి రాజధాని లేదు. అక్కడ రాజధాని వివాదాన్ని పరిష్కరించుకోవడంలో విఫలమైన ఏపీ నేతలు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలంటూ చేస్తున్న డిమాండ్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన అందెశ్రీ

## తెలంగాణ కళాకారులు కట్టు బానిసలన్నడు • ఆయన తెలంగాణలో మాయమైపోతున్న మనిషి

- ఆనాడు 550 మంది కళాకారులకు మేము ఉద్యోగాలిప్పించినం
- రేవంత్ వద్దే రాచరికపు ఆనవాళ్లు
- గీతాలు, టీజీ బోర్డులు మార్చడమేనా మీ పాలన?
- కేసీఆర్ పాలన యావత్ దేశానికే నాడు ఆదర్శం
- నా జన గీతం దోసిళ్లతో తేనె ఎత్తుకొని తాగినట్టుంటది
- 'నమస్తే తెలంగాణ'తో కవి, కళాకారుడు మిట్టపల్లి సురేందర్




**చిహ్నం, చార్మినార్‌ను రాచరికపు ఆనవాళ్లు అనడంపై మీరేమంటారు?**

అసలు రాచరికపు ఆనవాళ్లు కేసీఆర్‌వి కావు. అసలు రాచరికపు ఆనవాళ్లు అనేవి రేవంతన్న దగ్గరే ఉన్నయ్. ఉద్యమకాలం నుంచి సీఎం అయ్యేదాక కేసీఆర్ ఒక పాట రాయించాలంటే తెలంగాణ మేధావి వర్గాన్ని సంప్రదించి చేసేటోడు. సీఎం అయ్యాక కూడా అందరి ఆధీనంలోనే ఉన్నడు ఆయన. కొన్ని కారణాల చేత పార్టీ ఓటమిపాలయ్యింది. ఆయన ఎవరికీ అన్యాయం చేయలే. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయలే. ప్రజలు ఏం కాంక్షించారో.. అది చేసి ప్రజలను మెప్పించారు. కేసీఆర్ రెప్పపాటు కరెంటు పోనియ్యలే. దమ్ముంటే కేసీఆర్ పాలనను దాటి చూపించు.

జయశంకర్ భూపాలపల్లి, మే 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆత్మగౌరవాన్ని కవి, గాయకుడు అందెశ్రీ తాకట్టు పెట్టిండు.. తెలంగాణ కళాకారులు కట్టు బానిసలన్న అందెశ్రీ.. ఇప్పుడు ఆయన చేసేదేమిటని ప్రముఖ కవి, కళాకారుడు మిట్టపల్లి సురేందర్ ప్రశ్నించారు. తాము 550 మంది కళాకారులకు ఉద్యోగాలు ఇప్పించామని, గెలిచిన ఆరునెలలకే మీలా పాట రికార్డు కోసం భజనలు చేయలేదని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదని స్పష్టం చేశారు. కేసీఆర్.. తెలంగాణ ప్రజల ఆత్మవిశ్వాసమని, తొమ్మిదిన్నరేండ్లలో ఆయన నడిపిన పాలన యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఆయనను వేలెత్తి చూపే నైతిక అర్హత రేవంత్‌రెడ్డికి లేదని తెలిపారు. రాచరిక చిహ్నాలు, రాచరిక గేయాలు, టీఎస్ లోగోల మార్పు ఇప్పుడే గుర్తుకు వస్తున్నాయా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు? అని మండిపడ్డారు. పాలన చేతకాక అనవసరపు రాద్ధాంతం చేస్తే మీ నాయకులే ఛీ కొడతారని తేల్చిచెప్పారు. రాచరికపు ఆనవాళ్లు రేవంత్‌లోనే ఉన్నాయని స్పష్టం చేశారు. తాను రాసిన తెలంగాణ జన గీతం దోసిళ్లతో తేనె ఎత్తుకుని తాగినట్టుంటది అని అన్నారు. మిట్టపల్లి సురేందర్ రాసిన జన గీతం నేడు జనం ముందుకు వస్తున్న సందర్భంగా నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు.

**నమస్తే తెలంగాణ: రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాల తొలగింపుపై మీరేమంటారు?**

మిట్టపల్లి సురేందర్: రాజముద్ర పదేండ్ల క్రితం వచ్చింది కాదు. తెలంగాణ ఉద్యమకాలంలోనే ప్రముఖ చిత్రకారుడు లక్ష్మణ్ ఏలె ఎందరో మేధావులను, మరెందరో ఉద్యమ నేతలను కలిసి, వారి ఆలోచనలన్నీ సేకరించి చాలా శ్రమించి పొందుపర్చినదే ఆ చిహ్నం. దానికి వీళ్లు చీడపట్టినట్టు చేస్తున్నరు. 15 ఏండ్ల క్రితం డిజైన్ చేసిన తెలంగాణ చిహ్నాన్ని మార్చడం వల్ల రాష్ట్రానికి కొత్తగా నిధులొస్తయా, సంపద పెరుగుతుందా, ప్రజల కడుపు నిండుతుందా? ఇయాల నువ్ మారుస్తవ్, రేపు ఇంకో ప్రభుత్వం వస్తది. ఆ ప్రభుత్వం కూడా మారుస్తది కదా.. మీరు ఇగోలకు పోవడం వదిలేయండి. ప్రజలు ఏం కోరుకుంటరో అది చేయండి. పదేండ్ల నుంచి ఉన్న టీఎస్ బోర్డు తీసేసి టీజీ చేయడం.. ఎప్పటి నుంచో ప్రజల్లో ఉన్న గీతాన్ని మారుస్తాం అనడం.. సాహిత్యం మీద పట్టులేనోడు కూడా మాట్లాడుడేనా? తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి తెలంగాణకు తలవంపులు తెచ్చే ఆలోచనా విధానం ఇది. మన పక్క రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అనంతరం జగన్ ముఖ్యమంత్రి అయ్యారు. మరి జగన్ ఇలా ఎందుకు మార్పులు చేయలేదు. రేవంత్‌కు ఇక్కడ పాలన ఎలా చేయాలో అర్థం కాక ఈ పనుల మీద పడ్డట్టు అనిపిస్తుంది.

**లోగో మార్పుపై ఇప్పుడే ఎందుకు రభస?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో జరిగిన నిర్ణయాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం లేదు. లోగో తయారు చేసినప్పుడు, పాట రూపొందించినప్పుడు, తెలంగాణ స్టేట్ అని పెట్టినప్పుడు ప్రజలకు ఒక విశ్వాసం ఏర్పడింది. అది ఏర్పడి పదేండ్లు గడిచాక ఇప్పుడు నువ్వేంది చేసేది. అప్పుడు నువు ప్రతిపక్షంలో ఉన్నావు కదా, అప్పటి నుంచి ఎందుకు వ్యతిరేకించలేదు. చిహ్నంలో లోపాలున్నా, సరిచేయాలని ఎందుకు ఉద్యమాలు చేయలేదు. ఎందుకు పోరాటాలు చేయలేదు. ఇప్పుడా చిహ్నం గురించి మాట్లాడుడేంది.

**తెలంగాణ కళాకారులను బానిసలు, కూలీలు అన్న అందెశ్రీ వ్యాఖ్యలపై మీరేమంటారు?**

గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్, నందిని సిధారెడ్డి, కోదారి శ్రీనివాస్, ఏసుపాల్, చనిపోయిన సాయిచంద్ సహా ప్రభుత్వంతో దగ్గరగా ఉండి 550 మంది కళాకారులకు ఉద్యోగాలు ఇప్పించాం. ఏ రోజూ వ్యక్తిగత పనులు చేసుకోలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వానికి దగ్గరగా మెదిలిన కళాకారులందరినీ బానిసలు అన్నడు అందెశ్రీ. కూలీలు అన్నడు.. మేం బానిసత్వం చేసి, కూలిపని చేసి 550 మందికి ఉద్యోగాలు ఇప్పించినం. అందులో ఒక కళాకారున్ని రెండుసార్లు ఎమ్మెల్యే చేసినం. దేశపతి శ్రీనివాస్‌ను, గోరటి వెంకన్నను ఎమ్మెల్సీ చేసినం. సాయిచంద్‌ను ఒక చైర్మన్‌ను చేసినం. నందిని సిధారెడ్డిని ఒక బాషా సాంస్కృతికక శాఖకు చైర్మన్‌ను చేసినం. దర్శకుడు ఎన్ శంకర్‌కు స్టూడియోకు స్థలం ఇప్పించినం. విద్యార్థి పోరాటాలు చేసిన వారిని నాయకుల్ని చేసినం. నువ్వు (అందెశ్రీ) ముఖ్యమంత్రి దగ్గర కూర్చొని కేవలం నీ పాట రికార్డు చేయడం కోసం భజన చేస్తున్నావు. అసలు నిజమైన కట్టుబానిసవు నువ్వు. పాట రికార్డు చేయడానికి సీఎంతో పనేంటి. నువు పాట రాస్తే సీఎం నీ దగ్గరికి రావాలి. నిజమైన బానిసవు నువ్వు. నిజంగా అమ్ముడుపోయినోడివి నువ్వు. తెలంగాణలో కళాకారులున్నారా అని ప్రశ్నించినవ్. నువు తెలంగాణ ఉద్యమానికి పాటలు రాసినప్పుడు.. 20 ఏండ్లకు ముందు పాటరాసుకుంటూ వచ్చినప్పుడు ఎవడు కట్టిండు బాణీలు.. ఎవడు ఎత్తుకొని తిరిగిండు నీ పాటను.. నువు పాట రాసినప్పుడు కీరవాణి దగ్గరికి వెళ్లి సంగీతం అడగలేదు. అప్పుడు గుర్తుకు రాలేదా కీరవాణి. అందెశ్రీకి ప్రజలతో సంబంధమే లేదు. ఒక తెలంగాణ ఉద్యమంలో నాలుగు పాటలు తప్పితే వేరే పాటలు చూపెట్టు. సింగరేణి కార్మికులపై రాసినవా? గీతకార్మికులపై రాసినవా? చేనేత కార్మికులపై రాసినవా? నిరుద్యోగులపై రాసినవా?

**తెలంగాణ జాతి గీతానికి కీరవాణి సంగీతం సమకూర్చడంపై మీరేమంటారు?**

తెలుగు సినీ పరిశ్రమ లోపల ఆంధ్రా, తెలంగాణ అనే అభిప్రాయం పోయి పదేండ్లయింది. ఇప్పుడు ఆంధ్రా, తెలంగాణ అనే అభిప్రాయాన్ని చంద్రబాబు శిష్యుడిగా రేవంత్‌రెడ్డి రెచ్చగొడుతున్నాడు. అందెశ్రీ అనేటోడు కండ్లు మూసుకుని అంధునిలా ప్రవర్తిస్తూ కీరవాణికి పాట ఇచ్చి ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నడు. జనం మరిచిపోయి కలిసిపోయిన సమాజాన్ని విడగొడుతున్నాడు. కీరవాణిది తప్పులేదు. జాతీయ, ప్రపంచ కళాకారుడు అతను. కానీ అందెశ్రీ రాసిన పాట తెలంగాణ ప్రాంతీయుల ఆత్మగౌరవానికి సంబంధించింది. అది తెలంగాణ ప్రాంతం వాళ్లే చేయాలి. దాని హక్కుదారులు తెలంగాణ వారే. అనవసరంగా అందెశ్రీ వెళ్లి కీరవాణిని బదనాం చేసి ఆయన పేరు చెడగొడుతున్నడు. కీరవాణి అన్ని ప్రాంతాలకు చెందిన వ్యక్తి. కానీ అందెశ్రీకి ఒక ప్రాంతం ఉంది. ఒక ప్రాంతం మీద రాస్తేనే తనకు పేరొచ్చింది. 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు' అన్నట్లు అందెశ్రీ కూడా మాయమైపోతున్నడు తెలంగాణలో.

**మీరు ప్రజల ముందుకు తీసుకువచ్చే తెలంగాణ జనగీతం గురించి..**

వంద శాతం ప్రజలు కోరుకుంటున్న పాటను అందిస్తున్నా. అమరుల త్యాగాల మీద పాట ఇస్తున్న. ప్రతి ఏటా తెలంగాణ ఆవిర్భావ సమయంలో ఒక పాటను అందిస్తూ వస్తున్న. ఈసారి తెలంగాణ దశాబ్ది వేడుకలకు మంచి పాటను తీసుకొస్తున్న. ఈ పాట ప్రజల్లోకి వెళ్లుద్ది. పాడినవాళ్లు తెలంగాణ కళాకారులు. సంగీతం చేసినోళ్లు తెలంగాణోళ్లు. పాట దోసిళ్లతో తేనె ఎత్తుకుని తాగినట్టుంటది.

# మరో 2 వేల కోట్ల అప్పుకు సర్కారు సిద్ధం

హైదరాబాద్, మే31 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మరో 2 వేల కోట్లను అప్పుగా తీసుకునేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఆర్బీఐకి ఇండెంట్‌ను సమర్పించింది. దీనిపై ఈ నెల 4న ఆర్బీఐ ఆక్షన్ నిర్వహించనున్నది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లోనే రూ.16 వేల కోట్లను అప్పుగా తీసుకోవాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.10 వేల కోట్లను ఆర్బీఐ నుంచి అప్పుగా తీసుకున్నది. తాజాగా మరో రెండు వేల కోట్లు తీసుకునేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.27 వేల కోట్లు అప్పుగా తీసుకున్నది.

# రుణమాఫీపై మహారాష్ట్రలో స్టడీ

### రెండు రోజులపాటు ముంబైలోఅధికారుల పర్యటన

హైదరాబాద్, మే 31(నమస్తే తెలంగాణ): ఏకకాలంలో రైతు రుణమాఫీకి అవకాశం ఉన్న మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తున్నది. వివిధ రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేస్తున్నది. 2019లో మహారాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల లోపు రుణాలను రద్దు చేయడంతో, అక్కడి అనుభవాలను అధ్యయనం చేసేందుకు వ్యవసాయ, ఆర్థిక శాఖలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు బుధ, గురువారాల్లో ముంబైలో పర్యటించారు. మహారాష్ట్ర అధికారులతో సమావేశమై అక్కడ అనుసరించిన విధానాన్ని అధ్యయనం చేశారు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు చెందిన రూ.20,109 కోట్ల రుణాలను మాఫీ చేయడంతో అది ఎలా సాధ్యమైందనే అంశంపై వివరాలు సేకరించారు. ముంబై పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వచ్చిన ఆ ఇద్దరు అధికారులు తుది నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లోనే ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందించనున్నట్టు సమాచారం. మరోవైపు, రుణమాఫీకి కటాఫ్ తేదీని నిర్ణయించే అంశంపై కూడా ప్రభుత్వం తర్జన భర్జన పడుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతానికి రెండు తేదీలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 7వ తేదీతోపాటు తెలంగాణ రాష్ట్ర ప్రకటన, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టిన రోజు డిసెంబర్ 9వ తేదీని కూడా కటాఫ్ తేదీగా పరిశీలిస్తున్నట్టు తెలిసింది.